క్లుప్తంగా

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న పాఠశాల సిబ్బంది

పుత్తూరు: మొక్కలు నాటడం ద్వారా వాతావరణ కాలుష్యం తగ్గడంతోపాటు పర్యావరణాన్ని పరిరక్షించవచ్చునని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బి.చంద్రమౌళి పేర్కొన్నారు. గురువారం కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం, ఎకోక్లబ్ సంయుక్తంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ దేశ భూభాగంలో మూడోవంతు చెట్లు ఉండాలని అయితే ప్రస్తుతం 20 శాతం చెట్లు కూడా లేవని తెలిపారు. ప్రతి విద్యార్థి మొక్కలు నాటడాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. మొక్కలు నాటడంతోపాటు వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు కళాశాల ఆవరణలో ఎర్రచందనం తదితర మొక్కలను నాటారు. కార్యక్రమంలో వృక్షశాస్త్ర శాఖాధ్యక్షుడు డాక్టర్ కోటేశ్వరరావు, ఎకోక్లబ్ కన్వీనర్ పద్మావతి, సుజన తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న లారీ సీజ్



పోలీసులు సీజ్ చేసిన ఇసుక లారీ

విజయపురం: తమిళనాడు వైపు ఇసుక అక్రమంగా తరలిస్తున్న లారీని విజయపురం పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు.. పిచ్చాటూరు నుంచి పన్నూరు మీదుగా ఇసుక అక్రమంగా తరలిస్తున్న లారీని బుధవారం అర్ధరాత్రి పన్నూరు సబ్‌స్టేషన్ వద్ద ఎస్‌ఐ బలరాం తన సిబ్బందితో పట్టుకుని పోలీసుస్టేషన్‌కి తరలించారు. గురువారం తహసీల్దార్ కిరణ్ లారీకి రూ.లక్ష జరిమానా విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 లోపు ఇసుక తరలించడానికి అనుమతి ఉందని, ఆపై ఇసుక తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఇసుక డంప్ చేసి లారీ ద్వారా తమిళనాడుకు తరలిస్తే జరిమానాతోపాటు కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఉచితంగా పాదరక్షల పంపిణీ



దాక్టర్లతో మాట్లాడుతున్న జిల్లా లెప్రసీ అధికారి శ్రీనివాసులురెడ్డి

పుత్తూరు: కుష్టు వ్యాధిగ్రస్తులకు ఉచితంగా పాదరక్షలు ఇస్తున్నట్టు జిల్లా లెప్రసీ, టీబీ అధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గురువారం ఆయన పుత్తూరు మండల పరిధిలోని పరమేశ్వరమంగళం పీహెచ్‌సీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. లెప్రసీ, టీబీకి చికిత్స తీసుకుటున్న వారి వివరాల రికార్డులను పరిశీలించారు. ఆనంద్‌రాజ్ అనే వ్యాధిగ్రస్తుడితో మాట్లాడుతూ వైద్య సేవలందుతున్న తీరును తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్లు హేమభూషణ్‌రెడ్డి, సాయిచరణ్, ఫిజియోథెరపిస్ట్ వెంకటరమణ, లెప్రసీ నోడల్ ఆఫీసర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

జోరుగా పారిశుద్ధ్య పనులు



మురుగు కాలువలు శుభ్రం చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

పాలసముద్రం: వెంగళరాజుకుప్పం పంచాయతీలో గురువారం సర్పంచ్ లిల్లీ, వైస్ ఎంపీపీ పుష్ప, పంచాయతీ కార్యదర్శి సుధ కలసి జోరుగా పారిశుద్ధ్యం పనులు చేయించారు. మురుగు కాలువలను శుభ్రం చేయించి, ఇళ్ల పరిసరాల్లో ఉన్న నీటిని తొలగించి, బ్లీచింగ్ పౌడర చల్లారు.మలాథిన్ పిచికారీ చేశారు. ప్రజలందరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

శబరిమలైకు అయ్యప్ప భక్తులు



శబరిమలైకు వెళ్తున్న అయ్యప్ప భక్తులు

పాలసముద్రం: మండలంలోని ఆముదాల పంచాయతీ గొల్లకండ్రిగకు చెందిన అయ్యప్ప స్వామి మాల భక్తులు ప్రత్యేక పడిపూజలు నిర్వహించారు. స్వామివారి చిత్రపటం ఎదుట 18 పడికట్లను పుష్పాలతో సుందరంగా అలంకరించారు. దీపం, కర్పూరాలు వెలిగించి, కొబ్బరికాయులు కొట్టి, ప్రత్యేక పూజలు చేసి, ఇరుముడి కట్టారు. మాలధారణ భక్తులు శబరిమలైకు బయలుదేరారు.

బడి గంట పెరిగింది

ప్రభుత్వ బడుల పని వేళలు పెంచేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని మండలాల్లో ఒక్కో పాఠశాల చొప్పున ఎంపిక చేసి ఈ నెల 25 నుంచి 30 వరకు కొత్త సమయాన్ని అమలు చేయనున్నారు. దీనిపై వచ్చే అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఈ విధానాన్ని అమలు చేసేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఈ మేరకు ఈ నెల 16న జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు అందాయి. – నగరి



తడుకు ఆర్‌ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

- మారనున్న పాఠశాల టైమ్ టేబుల్
- ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు
- భోజన విరామానికి గంట సమయం

పొరుగు రాష్ట్రాలలో...

● తమిళనాడు: ఉదయం 9.30 నుండి సాయంత్రం 4.10 వరకు ● కర్ణాటక: ఉదయం 8.00 గంటల నుండి మధ్యాహ్నం 1.30 వరకు ● కేరళ: ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 3 వరకు కొన్ని సమయాల్లో ఉదయం 10 గంటల నుంచి 4 గంటల వరకు నిర్వహిస్తారు.

నియోజకవర్గంలోని 319 పాఠశాలల్లో ఈ సమయపాలన పాటించే నిమిత్తం కొన్ని మోడల్ పాఠశాలలను ఎంపిక చేయనున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో తిరుపతి జిల్లాలోని వడమాలపేటలో తడుకు ఆర్‌ఎస్ పాఠశాల, పుత్తూరు మండలంలో పిల్లారిపట్టు జడ్పీహెచ్‌ఎస్‌ను అధికారులు ఎంపిక చేశారు. ఇందులో ఈ నెల 25 నుంచి 30 వరకు కొత్త టైమ్ టేబుల్ ప్రకారం తరగతులు నిర్వహించనున్నారు. ఈ ఐదు రోజుల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎదుర్కొన్న సమస్యలను, విద్యార్థులకు కలిగే ప్రయోజనాలను పరిశీలించి ఎంఈఓలు నివేదికలు తయారు చేసి జిల్లా విద్యాశాఖ అధికారికి అందజేయనున్నారు.

ఉపాధ్యాయ సంఘాల వ్యతిరేకత

కొత్త పనివేళలపై ఉపాధ్యాయ సంఘాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పాఠశాలల పనివేళలను ప్రస్తుతం నిర్వహిస్తున్న ఉదయం 9 నుండి సాయంత్రం 4 గంటలకు బదులు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 వరకు పెంచుతూ కొన్ని పాఠశాలల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని నిర్ణయించారు. అమలుకు ఉత్తర్వులు కూడా ఇచ్చారు. పాఠశాలల పని వేళలు మార్చాలంటే విద్యార్థుల మానసిక స్థితి, విద్యార్థి అభ్యసన సంసిద్ధత, రవాణా సౌకర్యం, విద్యార్థినుల భద్రత, తదితర అంశాలు పరిగణనలోకి తీసుకోవాల్సి వస్తుందని వారు సూచిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలలో నుండి 05 నుండి 15 కి.మీ. దూరం పాఠశాలలకు విద్యార్థులు ప్రయాణం చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. సరైన సమయానికి రవాణా సౌకర్యం ఉండదని, బాలికలకు భద్రతా సమస్యలు తలెత్తే అవకాశం ఉందంటున్నారు. ప్రధానంగా విద్యార్థి తరగతి గదిలో ఎంత సమయం శ్రద్ధగా అభ్యసించే అవకాశం ఉంటుంది అనే అంశాలను పరిశీలించాలన్నారు. విద్యావేత్తలు, మానసిక వేత్తల సూచనలు, సలహాలు, వివిధ రాష్ట్రాలలో అమలవుతున్న పని గంటలను పరిశీలించాలని చెబుతున్నారు. ఎక్విప్‌మెంట్, టీచింగ్ పద్ధతులు, వసతులు, సిలబస్‌పై శ్రద్ధ చూపితే విద్యావ్యవస్థ బాగుపడుతుందంటున్నారు. సమయం పెంచితే విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనవుతారని విమర్శిస్తున్నారు.

ఫస్ట్ పీరియడ్ 50 నిమిషాలు

ప్రస్తుతం పాఠశాలలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తున్నారు. కొత్త టైమ్ టేబుల్ ప్రకారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తాయి. ఉదయం, మధ్యాహ్నం ఇచ్చే బ్రేక్ సమయాన్ని 5 నిమిషాల చొప్పున, భోజన విరామ సమయాన్ని 15 నిమిషాలు పెంచారు. ఉదయం మొదటి పీరియడ్‌ను 50 నిమిషాలు చేశారు. ఆ తర్వాత 3 పీరియడ్లు ప్రస్తుతం 40 నిమిషాలు చొప్పున ఉన్నాయి. వాటిని 45 నిమిషాలకు పెంచారు. మధ్యాహ్నం మొదటి పీరియడు మార్చకుండా, అనంతరం 3 పీరియడ్లను 45 నిమిషాలకు పెంచారు. ఈ మార్పు కారణంగా రోజులో పాఠశాల సమయం గంట పెరగనుంది.

పనివేళల మార్పు ఆమోద యోగ్యం కాదు



పనివేళల మార్పు ఆమోదయోగ్యం కాదు. ఒక్కో పాఠశాల పరిధిలో పలు హేబిటేషన్లు ఉంటాయి. సమయం మారిస్తే వారు బస్సుల కోసం ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఒక్క నగరి మండలంలో మాత్రమే 17 మంది టీచర్లు చిత్తూరు నుంచి వస్తున్నారు. వారు పాఠశాల ముగించుకుని తిరిగివెళ్లడం గగనమే అవుతుంది.

– మునిరత్నం, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్

ప్రభుత్వ ఆదేశాల మేరకు పనివేళలు



ప్రస్తుత పనివేళలనే కొనసాగించాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు కొత్త టైంటేబుల్ మేరకు తరగతులు నిర్వహిస్తాము. తిరుపతి జిల్లాలో ఎంపిక చేసిన కొన్ని పాఠశాలలను ప్రకటించారు. చిత్తూరు జిల్లాలో ఇంకా ప్రకటించలేదు. జిల్లా ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలను ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు తెలియజేస్తాం. అక్కడి ఫలితాలను ఉన్నతాధికారులకు నివేదిస్తాం. అనంతరం ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలల పనివేళల్లో మార్పు ఉంటుంది.

– శ్రీదేవి, ఎంఈఓ, నగరి మండలం

శ్రీశైలం మల్లన్న సేవలో మాజీ మంత్రి రోజా



శ్రీశైలం ఆలయం వద్ద మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి ఆర్కే రోజా శ్రీశైలంలోని శ్రీమల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. గురువారం శ్రీశైలం వెళ్లిన ఆమె భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు.

ఆధార్ కార్డు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఆధార్ కార్డు శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాలసముద్రం: మండలంలో నిర్వహిస్తున్న ఆధార్ కార్డు శిబిరాన్ని ప్రజలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ క్రిష్ణ మహేష్‌రెడ్డి కోరారు. గురువారం వెంగళరాజు కుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో హెచ్ఎం చక్రధరరావ్ ఆధ్వర్యంలో ఆధార్ కార్డు శిబిరం నిర్వహించారు. దీనిని ఎంపీడీఓ పరిశీలించారు. విద్యార్థులు తమ ఆధార్ కార్డులో వయస్సు, పేర్లు తప్పులు ఉంటే వాటిని సవరించుకునేందుకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్, డిజిటల్ అసిస్టెంట్ మోహన్, చారుమతి పాల్గొన్నారు.

సారా రహితంగా తీర్చిదిద్దుతాం

- గంజాయి అమ్మకాలపై ప్రత్యే నిఘా
- బెల్టుషాపులపై ఉక్కుపాదం తప్పదు
- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్



సిబ్బందికి సలహాలు, సూచనలు ఇస్తున్న డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్

కార్వేటినగరం: చిత్తూరు జిల్లాను సారా రహితంగా మార్చు తీసుకు రావడమే లక్ష్యంగా ఎక్సైజ్ శాఖ పనిచేస్తోందని ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ అన్నారు. గురువారం ఎక్సైజ్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాల్లో సారా అమ్మకాలు, తయారీలపై దాడులు నిర్వహించి ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి జిల్లాకు రాకుండా అరికట్టేందుకు ఆయా రాష్ట్రాల అధికారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, కట్టడికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామాల్లో సారా తయారీ, అమ్మకాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే ఆధికారుల దృష్టికి తీసుకురావాలని, వారి వివరాలని గోప్యంగా ఉంచుతామన్నారు. అనంతరం ఎక్సైజ్ సిబ్బందికి అక్రమ వ్యాపారాల నివారణపై పలు సూచనలు, సలహాలను అందించారు. ఆయన వెంట ఎక్సైజ్ సీఐ శిరీషాదేవి, ఎస్‌ఐలు, సిబ్బంది ఉన్నారు.

ఇంటి పట్టాలు ఇవ్వండి

పుత్తూరు: మండల పరిధిలోని తడుకు పంచాయతీ వేంకటేశ్వర దాసరి ఇండ్లలో నివశిస్తున్న తమకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ గ్రామస్తులు గురువారం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తడుకు లెక్క దాఖలాలోని సర్వే నెంబర్ 6/2లో గుట్ట పొరంబోకును తీర్చుకుని పదేళ్లుగా నివశిస్తున్నామని తెలిపారు. గత కొన్నేళ్లుగా ఇంటి పట్టాల కోసం పలుమార్లు అర్జీలు ఇచ్చామని, అయినా అధికారులు కరుణించలేదన్నారు. ఇకనైనా తమకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. దీనిపై తహసీల్దారు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అర్హులైన వారందరికీ ఇంటి పట్టాలు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నందయ్య, మురళీ, వెంకటస్వామి, వెంకటరాజన్న, మురగయ్య, యశోద, శైలజ, చందు, కావేరి, గంగ తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన సదస్సు

వడమాలపేట(విజయపురం): వడమాలపేట మండల ఎస్‌బీఆర్‌పురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు పోషకాహార ప్రాముఖ్యతపై సూపర్‌వైజర్ రోజారమణి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, బాల్య వివాహాలు జరగకుండా చూసుకోవాలన్నారు. అత్యధిక పోషక విలువలు కలిగిన ఆకుకూరలు, పండ్లు, పాలు, పీచు పదార్థాలతో పాటు, ఐరన్ సంబంధిత ఆహార పదార్థాలు ఎక్కువ తీసుకోవాలన్నారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే అన్ని రంగాల్లో రాణించగలరని గుర్తు చేశారు. బాలికలు శుభ్రమైన నాప్కిన్ ఉపయోగించి శారీరక శుభ్రతను పాటించాలన్నారు. ఎవరైనా ఇబ్బంది పెట్టినా.. మానసికంగా హింసిస్తున్నా వెంటనే 1098 లేదా 100, 181కు సమాచారం అందించాలన్నారు.



వడమాలపేట : ఎస్‌బీఆర్ పురం ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు

పరిచయం లేని వ్యక్తులతో మాట్లాడకూడదని హెచ్చరించారు. విద్యార్థినులు మొబైల్ ఫోన్, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలసుబ్రమణ్యం, ఉపాధ్యాయులు జయచంద్ర, సుజాత, మహిళా పోలీసు మహేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధరాఘాతం

- మండుతున్న నిత్యావసరాల ధరలు
- ఆందోళనలో నిరుపేద, మధ్య తరగతి ప్రజలు
- ధరల నియంత్రణలో కూటమి ప్రభుత్వం విఫలం
- ఐదు నెలల్లో విపరీతంగా పెరిగిన ధరలు
- కిలో తెల్లగడ్డ రూ.550, సన్ ఫ్లవర్ ఆయిల్ రూ.140



సూపర్ మార్కెట్‌లో నిత్యావసర వస్తువులు

విజయపురం: ప్రస్తుతం వర్షాలు పడుతుంటే వాతావరణం చల్లగా ఉందని వేడివేడిగా ఏదైనా చేసుకుని తిందామంటే నిత్యావసరాల ధరలు మండిపోతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నీ ధరలు పెరిగిపోయాయి. పెరిగిపోతున్న నిత్యావసరాల ధరలతో నిరుపేద, మధ్య తరగతి ప్రజల జీవనం దుర్భరంగా మారింది. సరుకుల ధరలతోపాటు కూరగాయల ధరలు సైతం పెరిగిపోవడంతో సామాన్య ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఓ పక్కన కిరాణా షాపునకు వెళ్లి నిత్యావసరాల ధరలు చూస్తే భయం పుట్టుకొస్తోంది. అలాగే కూరగాయల మార్కెట్‌కు వెళ్లి చూసి కొనలేక... తినలేక ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

రెండు నెలల్లోనే...

గత రెండు నెలల నుండి మార్కెట్లో సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజలు మార్కెట్‌కు వెళ్లి పెరిగిన ధరలు చూసి గుండెలు బాదుకుంటున్నారు. ఒక వైపు నిత్యావసర సరుకులు, మరోవైపు కూరగాయల ధరలు పెరిగి పోవడంతో ఏం కొనలేని, తినలేని పరిస్థితి నెలకొందని అంటున్నారు. సన్‌ఫ్లవర్ ఆయిల్, పామాయిల్ నూనె ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. కొబ్బరి, వెల్లుల్లి ధరలు దాదాపు రెట్టింపు అయ్యాయి. సన్‌ఫ్లవర్ ఆయిల్ 15 లీటర్ల డబ్బా రెండు నెలల క్రితం రూ.1,600 ఉండగా, ప్రస్తుతం రూ.2,050కి పైగానే పలుకుతోంది. దీంతో సామాన్య ప్రజానీకం ధరలపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.



కూరగాయలు

వ్యాపారం అంతంత మాత్రమే...

ధరలు పెరిగిపోవడంతో అర్ధాకలితో ఉంటున్నామని ఓ పక్క ప్రజలు అంటుంటే, మరో పక్క ధరలు పెరుగుదలతో వ్యాపారం లేదని షాపు యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరకొర కొనుగోళ్లతో ప్రజలు సర్దుకుపోతుంటే వ్యాపారం లేక దుకాణదారులు నష్టపోతున్నారు. ఒకప్పుడు కిటకిటలాడిన మార్కెట్లు, కిరాణా షాపులు ఇప్పుడు వెలవెలబోతున్నాయి. ఒక వేళ ఎవరైనా వచ్చినా అరకొరగా సరుకులు తీసుకెళ్తున్నారని వ్యాపారస్తులు చెబుతున్నారు.

నిత్యావసరాల ధరలు

సన్‌ఫ్లవర్ ఆయిల్	140
పామోలిన్	120
కందిపప్పు	190
ఉద్దిపప్పు	160
చింతపండు	140
తెల్లగడ్డ	550
టమాట	80
ఎర్రగడ్డ	60
బంగాళదుంప	60
వంకాయ	60
అల్లం	150
చిక్కుడు, క్యారెట్	60

కూటమి మాటలతో సరి

గత వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు బియ్యంతోపాటు చక్కెర, కందిపప్పు పంపిణీ చేసింది. నిత్యావసర సరుకులు ఇంటింటికీ సరఫరా అయ్యేవి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కార్డుదారులకు కందిపప్పు, చక్కెర ఇవ్వకుండా బియ్యంతో సరిపెడుతోంది. కందిపప్పు పంపిణీ చేస్తామన్న ప్రభుత్వం మాటలకే పరిమితమైందంటూ ప్రజల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అదేవిధంగా ధరల నియంత్రణకు చర్యలు చేపట్టకుండా పేదల జీవితాలతో చెలగాటమాడుతోందని విమర్శిస్తున్నారు.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణలో ఘోరంగా విఫలమయ్యాయి. మార్కెట్లో నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. పెరిగిన ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలు ఏం కొనలేని, ఏం తినలేని పరిస్థితి. ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి విపరీతంగా పెరిగిపోతున్న నిత్యావసర, కూరగాయల ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– నాగరాజు, మాధవరం, విజయపురం

ఆరోగ్య సూత్రాలు పాటించండి

వడమాలపేట(విజయపురం): ఆరోగ్య సూత్రాలు పాటిస్తే సంతోషంగా జీవించవచ్చునని జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి డాక్టర్ హర్షవర్ధన్ తెలిపారు. గురువారం వడమాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సబ్ సెంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులు, రిపోర్టులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు, విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ సంతోషంగా జీవించాలన్నారు. బాలింతలు పరీక్షలు చేయించుకుంటూ డాక్టర్ సలహాలు పాటించాలన్నారు. వైద్య సిబ్బంది గ్రామా ల్లో తిరుగుతూ వైద్యసేవలు అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలలో అవగాహన కల్పించి, రోగాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డాక్టర్ హర్షవర్ధన్ తెలిపారు. ఎస్‌ఓ నాగేంద్ర కుమార్, డీపీఓ ప్రకాష్, డాక్టర్ చక్రపాణి, సీహెచ్‌ఓ పురుషోత్తంరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ ఎంలు పాల్గొన్నారు.



వడమాలపేటలో రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా అధికారులు

చెత్త నుంచి సంపద తయారీపై ప్రత్యేక శ్రద్ధ

పాలసముద్రం: మండలంలోని అన్ని పంచాయతీల్లో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై గ్రీన్ అంబాసిడర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఎఫ్‌టీసీ జేమ్స్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. గురువారం పాలసముద్రం చెత్త సేకరణ కేంద్రాన్ని వారు సందర్శించి మాట్లాడారు. గ్రీన్ అంబాసిడర్లు ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించి వర్మీ కంపోస్టు తయారు చేయాలన్నారు. తయారైన ఎరువును రైతులకు తక్కువ ధరకు విక్రయించాలన్నారు. అనంతరం తొట్టిలో ఉన్న ఎరువులను పరిశీలించారు.



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో ఎరువుల తొట్టెలను పరిశీలిస్తున్న డీఎఫ్‌టీసీ జేమ్స్

కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు పరిశీలన



సిమెంట్ రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీఓ

వడమాలపేట(విజయపురం): వడమాలపేట, నారాయణపురం సిమెంట్ రోడ్డును ఎంపీడీఓ శేషగిరిరావు గురువారం పరిశీలించారు. వడమాలపేట మండలంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో వేస్తున్న సిమెంట్ రోడ్డును డీఈ వెంకటరమణ, ఏఈ నాగేంద్రతోపాటు ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనిలో నాణ్యత ఉండాలని సూచించారు.

సారా ఊట ధ్వంసం

నగరి: రూరల్ మండలం ముడిపల్లిలో గురువారం నిర్వహించిన దాడుల్లో 1,000 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారి తెలిపారు. ముడపల్లి అటవీ ప్రాంతంలో పెద్దఎత్తున సారా తయారీ, విక్రయాలు జరుగుతున్నట్లు గురువారం పోలీసులకు సమాచారం అందింది. ఈ క్రమంలో నగరి సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో తన బలగాలతో కలసి ముడిపల్లి చేరుకుని దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన 1,000 లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు జిల్లా అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు. సారా తయారీ, విక్రయాలు నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ రామచంద్ర, సుందరం, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.